సాక్షి అనంతపురం

మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి. మార్కెట్‌కు 18 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



ప్రకృతి సేద్యం ఆమోదయోగ్యం

తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి సేద్యం ఆమోదయోగ్యమైనదని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.3°/22.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

సెల్‌ఫోన్ దొంగలపై ప్రత్యేక నిఘా



బాధితులకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: సెల్‌ఫోన్లు తస్కరించే దొంగలపై ప్రత్యేక నిఘా పెడతామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. సోమవారం ఉదయం పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో రూ.73 లక్షలు విలువ చేసే 372 సెల్‌ఫోన్‌లను బాధితులకు ఎస్పీ అందజేశారు. ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ చాట్ బాట్ సేవల ద్వారా ఇప్పటి వరకు రూ.12.03 కోట్లు విలువ చేసే 7,417 మొబైల్ ఫోన్లు అందజేశామన్నారు. ఈసారి వినూత్నంగా ఆలోచించి సెల్‌ఫోన్ చోరీ అయ్యిందా.. పోగొట్టుకుపోయిందా అనే కోణంలో పరిశీలిస్తామని తెలిపారు. చోరీకి గురై ఉంటే వాటిపై నిఘా ఉంచుతామన్నారు. మిస్ అయ్యి ఎవరికైనా దొరికితే.. వాటిని తీసుకొచ్చి పోలీసులకు అందజేసిన వారికి సన్మానం చేస్తామని చెప్పారు. జిల్లాలో సైబర్ నేరాలను పోలీసుశాఖ సీరియస్‌గా పరిగణించిందన్నారు. సైబర్ నేరాల బారినపడిన వారు 1930 నంబర్‌కు ఫిర్యాదులు చేయాలని సూచించారు. ఎవరినైనా కించపరుస్తూ లేదా అవమానపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే.. అలాంటి వారిపై సైబర్ బుల్లీ షీట్లు ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. మహిళలు, పిల్లలను ఇబ్బంది పెడుతుంటే తన నంబర్ 9440796800కు సమాచారం పంపాలని సూచించారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్పీ సీఐ ఇందిర, సీఐ జాకీర్, టెక్నికల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రగ్బీ చాంపియన్‌గా 'అనంత'



ట్రోఫీ అందుకుంటున్న 'అనంత' బాలికల జట్టు

హిందూపురం టౌన్: కర్నూలులోని ఆదర్శ పాఠశాల వేదికగా రెండు రోజులుగా జరిగిన 9వ రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి అనంత జిల్లా క్రీడాకారులు చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నారు. ఈ పోటీలు సోమవారం ముగిసాయి. ఉమ్మడి అనంతపురం జిల్లా బాలికల జట్టు ఫైనల్‌లో కర్నూలు జట్టుతో తలపడి 10 - 5 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. జట్టు విజయంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లోహిత, సాయి మనీషా, ప్రియమణితో పాటు కోచ్ రూపవతిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ప్రవీణ్‌రెడ్డి, యాసిన్ మాలిక్, రగ్బీ సంఘం సభ్యులు ఈశ్వరరెడ్డి, విష్ణు, మల్లికార్జున, ముస్తఖీమ్ అభినందించారు. ఇదే పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా బాలుర జట్టు మూడో స్థానంలో నిలిచింది.

నేటి నుంచి సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ

అనంతపురం: సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నీ (మల్టీడే) మంగళవారం నుంచి ఈ నెల 21 వరకు కడపలో నిర్వహించనున్నారు. ఇందులో ప్రాతినిథ్యం వహించే అనంతపురం జిల్లా అండర్-23 జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎంకే దత్తా రెడ్డి, పి.అర్జున్ టెండూల్కర్, బి.యోగానంద, టి. మహేంద్రరెడ్డి, డి.ఖాదర్‌వలి, చైత్ర వర్ధన్, కేఎస్ రోహిత్ రోషన్, ఎస్ఎండీ కామిల్, ఎం.దీపక్, టి.ప్రదీప్‌రెడ్డి, బి.సంతోష్, ఎస్.రేవంత్‌రెడ్డి, డి.తన్వీర్ జమాల్, ఎ.జయంత్ కృష్ణ, జి.మల్లికార్జున, లోహిత్ సాయి కిషోర్ ఎంపికైన వారిలో ఉన్నారు.

టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక



రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ పోటీలు అనంతపురంలో ఈ నెల 13 నుంచి 16 వరకు నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనే అనంతపురం జిల్లా పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రావు తెలిపారు. ఎంపికైన వారిని జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రావు, కోచ్‌లు ధనుంజయరెడ్డి, రవీంద్రనాథ్ అభినందించారు.

పురుషుల జట్టు: టి.వంశీకృష్ణ, సి.కుషాల్ కుమార్, ఎస్‌పీఎన్ కృష్ణ, టి.అచ్యుత్ సోనాత్‌రెడ్డి, బి.ధార్మిక్.

అండర్-17 బాయ్స్ జట్టు : ఎం.కుషాల్, సుశాంక్ రెడ్డి, వి.దీక్షిత్, ఎం.డి.అస్లాం.

ఉమెన్స్ జట్టు: సి.విద్యాధరి, ఆర్.మనస్విణి, సుబహానా అక్తర్, యు.మోక్షిత, జ్ఞాపిక.

అండర్-17 గర్ల్స్ జట్టు: ఎం.శ్రీ షాన్వి, సాహితీ జ్యోతి, పి.ఈశా సంజన, ఆర్.హాసిని.

బాబు జైలులో.. పార్టీ ఊబిలో

☛ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి, అధికారంలోకి రావడానికి అహర్నిశలూ శ్రమించాం. ఏళ్లతరబడి జెండా మోసినా మమ్మల్ని పట్టించుకోలేదు. మా నాయకుడు మంత్రిగా పని చేసినా మాకు పైసా లబ్ధి లేదు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే మాకు ప్రభుత్వ ఫలాలు దక్కాయి.
– రాయదుర్గానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త మనోగతం

☛ నేను ఇరవై ఏళ్లుగా టీడీపీకి ఓటేస్తున్నా. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మాకు ఎటువంటి లబ్ధీ జరగలేదు. పార్టీలో పదవులు లేవు. కుటుంబానికి ప్రభుత్వ పథకాలు దక్కలేదు. ఇప్పుడు అధినేతలకు ఆపద వచ్చిందని పిలుపునిస్తే మనసు చంపుకుని వెళ్లలేకపోతున్నాం.
– గుంతకల్లుకు చెందిన ఓ దళిత మహిళ నిట్టూర్పు

- అవినీతిలో అడ్డంగా దొరికి ఆందోళన చేయమంటారా?
- పదవిలో ఉన్నప్పుడు మమ్మల్ని పట్టించుకున్న పాపాన పోలేదు
- తెలుగుదేశం పార్టీ కింది స్థాయి నాయకుల్లో పెల్లుబుకుతున్న ఆక్రోశం
- మోతలు, ర్యాలీలు, నిరసనలకు ఆమడ దూరంలో కార్యకర్తలు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు కుంభకోణాల్లో ఇరుక్కుని జైలుపాలయ్యారు. జిల్లాలో ఆ పార్టీ పరిస్థితి ఊబిలో కూరుకుపోయినట్టయ్యింది. తాను అరెస్టు అవ్వగానే ఉవ్వెత్తున ఆగ్రహజ్వాలలు వస్తాయని ఆశించిన అధినేతకు, టీడీపీ నాయకులకు నిరాశ ఎదురైంది. 2019కి ముందు తెలుగుదేశం పార్టీకి పట్టు ఉన్న ఈ జిల్లాలోనే పార్టీ పరిస్థితి ఇలా ఉందంటూ శ్రేణుల్లో నిట్టూర్పు మొదలైంది. కొంతమంది ద్వితీయ శ్రేణి నాయకులు.. 'మీరు అవినీతిలో కూరుకుపోయి ఇప్పుడు మమ్మల్ని రోడ్డెక్కమంటారా' అంటూ ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. ముఖ్య నేతలు ఆందోళనలకు పిలిపిస్తే జిల్లాలో పట్టుమని పదిమంది కార్యకర్తలు కూడా స్పందించి రోడ్డుపైకి రాలేదు.

నాయకుడెవరో తెలియని స్థితిలో..

చంద్రబాబు నాయుడు జైలుకు వెళ్లిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీని నడిపించేదెవరన్న గందరగోళంలో కార్యకర్తలు తలోదారి పట్టారు. లోకేష్ నాయకత్వాన్ని ఇక్కడ ఎవరూ ఒప్పుకునే పరిస్థితి కనిపించలేదు. మరోవైపు టీడీపీ అనుకూల మీడియా మాత్రం బ్రాహ్మణి ముందుకు రావాలని, భువనేశ్వరి బస్సు యాత్ర చేయాలని, పవన్ కళ్యాణ్ అండగా ఉన్నాడని ఇలా రకరకాలుగా చెబుతుండడంతో అనంతపురం జిల్లాలో పార్టీ పరిస్థితి ఏమిటన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. అసలే జిల్లాలో నాయకుల మధ్య సఖ్యత లేక పార్టీ పరిస్థితి పూర్తిగా దిగజారింది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించి, ఎవరినీ పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పుడేమో అధినేత జైలుకెళ్లగానే రోడ్డు మీదకు రండి అంటూ ఆర్తనాదాలు చేస్తున్నారని కార్యకర్తలు బాహాటంగా విమర్శిస్తున్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

2019 ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పార్టీల బలాలు ఇలా	
మొత్తం ఓట్లు	32,39,527
పోలైన ఓట్లు	26,54,257
వైఎస్సార్ కాంగ్రెస్‌కు	13,69,739
తెలుగుదేశం పార్టీకి	11,99,922
వైఎస్సార్ కాంగ్రెస్‌కు అసెంబ్లీ సీట్లు	12
తెలుగుదేశం పార్టీకి	02
వైఎస్సార్ కాంగ్రెస్‌కు ఎంపీలు	02
తెలుగుదేశం పార్టీకి	00

కార్యకర్తల్లో ఊసే లేదు..

ములాఖత్ అనంతరం మిలాఖత్ అంటూ పొత్తుగురించి పవన్‌కళ్యాణ్ చెప్పినా అనంతపురం జిల్లాలో పొత్తులు పనిచేయలేదు. దీనిపై ఎక్కడా ఊసే లేదు. జనసేన-టీడీపీ కార్యకర్తలు ఉమ్మడిగా నిర్వహించే కార్యక్రమాలు దివిటీ పెట్టి చూసినా కనిపించలేదు. నిర్వహించకపోగా రెండు పార్టీల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. సీట్లు, ఓట్లు మేము లేకపోతే మీకెక్కడివి అంటూ ఒకరినొకరు విమర్శించుకోవడం కనిపిస్తోంది. ఈ పరిస్థితుల్లో తెలుగుదేశం పార్టీ చుక్కాని లేని నావలా ఉందని కార్యకర్తలు వాపోతున్నారు. చంద్రబాబు జైలు నుంచి ఇప్పుడే బయటకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. అధికారంలో ఉన్న పార్టీ అర్హులైన వారందరికీ పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా సంక్షేమ ఫలాలు ఇవ్వడంతో తెలుగుదేశం పార్టీని ప్రజలు మర్చిపోతున్నట్టు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



కేరళ టూర్‌లో ఉన్న టీడీపీ కౌన్సిలర్ల గ్రూప్ ఫొటో

విహారయాత్రలో టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రి అర్బన్: టీడీపీ చంద్రబాబు 'స్కిల్' స్కాంలో రిమాండ్ ఖైదీగా జైలుకెళ్లారు. అరెస్టును వ్యతిరేకిస్తూ గాంధీ జయంతి రోజున 'సత్యమేవ జయతే' పేరిట రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని టీడీపీ అధిష్టానం పిలుపునిచ్చింది. అయితే టీడీపీ కార్యకర్తల నుంచి కానీ, ప్రజల నుంచి కానీ ఎటువంటి స్పందనా కనిపించలేదు. తాడిపత్రిలో ఈ విషయం ప్రస్ఫుటమైంది. ప్రజాధనం దుర్వినియోగం కేసులో ఇరుక్కున్న వారికి మద్దతుగా ఆందోళనలు చేస్తే ప్రజల్లో మనం కూడా మరింత చులకన అవుతామని టీడీపీ నాయకులు భావించినట్టు ఉన్నారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సహచర కౌన్సిలర్లను విహారయాత్ర కోసం కేరళకు పంపించారు. వారు కుటుంబ సభ్యులతో సంతోషంగా విహారయాత్రను ఆస్వాదిస్తుండటం గమనార్హం. ప్రభాకర్‌రెడ్డి మాత్రం అనుచరులతో కలిసి కాసేపు దీక్ష చేపట్టి 'మమ' అనిపించారు.

బాపూ బాటలో పయనిద్దాం

- గాంధీ జయంతి వేడుకల్లో కలెక్టర్ గౌతమి



గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమి, ఇతర ప్రముఖులు

అనంతపురం కల్చరల్: మహాత్మా గాంధీ ఆదర్శాలు అనుసరణీయమని, బాపూ బాటలోనే ప్రతి ఒక్కరూ పయనిద్దామని కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సోమవారం నగరంలోని పాతూరులోని గాంధీ విగ్రహం వద్ద కలెక్టర్ ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ గాంధీజీతో పాటు ఎందరో మహానుభావులు పెట్టిన భిక్ష అని అన్నారు. ఆనాడు మహాత్ముని వెంట నడిచి స్వాతంత్య్రం కోసం తమ మాన ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవాలన్నారు. ఆర్య వైశ్య ప్రముఖుడు గోపామచ్చా నరసింహులు ఆధ్వర్యంలో కొత్తూరు క్లాక్‌టవర్ వద్ద ఉన్న మహాత్ముని విగ్రహానికి, పిన్ని నాగరత్నం, తిరువీధుల జగదీష్ ఆధ్వర్యంలో పాతూరు గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వర్థనాయక్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌యాదవ్, ధనుంజయయాదవ్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న తదితరులు గాంధీ మహాత్ముని విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతమైన ఆలోచనలు, విలువలు భావితరాల వారికి అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ప్రజలకందించారని తెలిపారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులుతో పాటు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, శ్రీగోవింద వాసవి సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు 29 ప్రాంతాల్లో 'ఆరోగ్య సురక్ష'

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆరోగ్య శాఖ



అనంతపురం మెడికల్: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులు మంగళవారం జిల్లాలోని 29 ప్రాంతాల్లో జరగనున్నాయి. ఈ మేరకు కలెక్టర్ గౌతమి ఆదేశాలతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.భ్రమరాంబదేవి ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ క్యాంపులకు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో కలుపుకుని 116 మంది వైద్యులు సేవలందించనున్నారు. ప్రతి వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వద్ద 104 వాహనం, సమస్యలున్న రోగులను నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ రిజిస్ట్రేషన్, తదితర సౌలభ్యాలను అందుబాటులో ఉంచారు. రోగుల కోసం 86 రకాల మందులు అందుబాటులో ఉంచారు. వీటితో పాటు వివిధ రకాల పరీక్షలు చేయించడానికి సర్వం సిద్ధం చేశారు. గత నెల 15 నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆరోగ్య శాఖ ఇంటింటా సర్వే చేసింది. అందులో సమస్యలున్న వారిని గుర్తించి వారికి టోకన్లు అందజేశారు. నేటి క్యాంపులకు ఐదు వేల నుంచి ఎనిమిది వేల మంది వరకు వచ్చే అవకాశం ఉన్నట్లు ఆరోగ్యశాఖాధికారులు చెబుతున్నారు.

ఆరోగ్య సురక్ష క్యాంపులు ఎక్కడంటే..

అనంతపురం శివారులోని ఎ.నారాయణపురం- 2, ఇందిరాగాంధీ యూపీహెచ్‌సీ, అనంతపురం, తోపుదుర్తి, ఎర్రగుడి, బండూరు, పాలవెంకటాపురం, బీకే సముద్రం- 2, బూదేడు, బసినేపల్లి, తాళ్లకెర-1, దోసలుడికి, కొట్టూరు, కంబదూరు-3, బెనేకల్లు, గొట్కూరు, అప్పిలేపల్లి, బొందలవాడ, దేవరపల్లి, క్రిష్టిపాడు- 2, దోసలేడు, గాండ్లపర్తి, జుంజురాంపల్లి, ఇ.సోదనపల్లి, చుక్కలూరు-2, ఉరవకొండ- 3, రాగులపాడు, డొనేకల్, చందన, వెన్నపూసపల్లి ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ఏర్పాటు చేశారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ఇంటింటా సర్వే పూర్తి చేశాం. టోకెన్ పొందిన ప్రజలందరూ క్యాంపులకు తప్పక రావాలి. వారి సమస్యలకు వైద్య చికిత్సలు అందించి, అవసరమైతే నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తాం. ప్రభుత్వం అందిస్తున్న గొప్ప అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.
– ఇ.భ్రమరాంబదేవి, డీఎంహెచ్‌ఓ

ఉద్యాన పంటల జోష్



పండ్లతోటల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారులు

- ఖరీఫ్‌లో పెరిగిన పండ్లతోటల విస్తీర్ణం
- ఈ-క్రాప్ కింద 2.58 లక్షల ఎకరాలు నమోదు

అనంతపురం అగ్రికల్చర్: ఉద్యానహబ్‌గా పేరుగాంచిన జిల్లాలో పండ్లతోటల విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహక రాయితీలు, ఉచిత పంటల బీమా పథకాలు అమలు చేస్తుండటంతో ఉద్యాన రైతులకు ఉపశమనం లభిస్తోంది. నాలుగేళ్లుగా వరుణుడు కరుణించడంతో నీటి వనరులు పెరిగాయి. దీంతో రైతులు ఉద్యాన పంటల సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుత ఖరీఫ్‌లో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పంటల సాగుకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ దాదాపు పూర్తి చేశారు. అన్ని రకాల ఉద్యాన పంటలు 1,72,456 ఎకరాల్లో సాగులోకి వస్తాయని అంచనా వేశారు. కానీ... ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తే ఇప్పటికే 2.58 లక్షల ఎకరాలు దాటింది. అంటే 70 వేల హెక్టార్లకు గానూ 1.04 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పండ్లు, పూలు, కూరగాయల పంటలు సాగు చేశారు. అంటే సాధారణం కన్నా 85 వేల ఎకరాలు (34 వేల హెక్టార్లు) అధికంగా రావడం విశేషం. అయితే పంటల వారీగా విస్తీర్ణం ఎంతనేది ఇంకా తేలాల్సి ఉంది. మిరప పంటపై రైతులు ఆసక్తి చూపించడంతో సాగు విస్తీర్ణం పెరిగినట్లు అంచనా వేస్తున్నారు.

గార్లదిన్నె టాప్ ..

ఉద్యాన పంటల సాగులో గార్లదిన్నె మండలం 20,100 ఎకరాల విస్తీర్ణంతో అగ్రస్థానంలో ఉంది. తర్వాత యల్లనూరు 16,050 ఎకరాలు, కళ్యాణదుర్గం 13,600 ఎకరాలు, విడపనకల్లు 13,300 ఎకరాలు, నార్పల 12,900 ఎకరాలు, కూడేరు 12,500 ఎకరాలు, పుట్లూరు 11,700 ఎకరాల్లో ఉద్యాన పంటలు వేశారు. తక్కువగా అంటే గుమ్మఘట్ట మండలంలో 3,400 ఎకరాలు, తాడిపత్రి 4 వేల ఎకరాలు, గుత్తి 4,600 ఎకరాలు, డి.హిరేహాళ్ 5,100 ఎకరాలు, పెద్దవడుగూరు 5,300 ఎకరాల్లో సాగు చేయగా... మిగతా మండలాల్లో 5,500 నుంచి రూ.10 వేల ఎకరాల వరకు అన్ని రకాల ఉద్యాన పంటలు సాగులోకి వచ్చినట్లు ఈ-క్రాప్ నివేదిక వెల్లడిస్తోంది.

ఎన్ఐఏ సోదాల కలకలం





అనంతపురంలోని శ్రీరాములు ఇంట్లో ఎన్ఐఏ అధికారులు సోదా చేస్తుండగా బయట కాపలా ఉన్న పోలీసులు, కుటాగుళ్లలో సోదాలు ముగించుకుని వెళుతున్న అధికారులు

- మావోయిస్టు సానుభూతిపరుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు
- అనంతలో టీచర్ శ్రీరాములు ఇంట్లో తనిఖీలు
- 6న విచారణకు హాజరుకావాలని నోటీసు అందజేత
- కుటాగుళ్లకు చెందిన చంద్రను అదుపులోకి తీసుకుని బెంగళూరుకు తరలించిన ఎన్ఐఏ బృందం

అనంతపురం క్రైం/యాడికి/కదిరి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు సోదాలు నిర్వహించారు. అనంతపురంలోని కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు, శింగనమల మండలం సలకం చెరువు జెడ్పీ హైస్కూల్‌లో హిందీ పండిట్‌గా పని చేస్తున్న ఎరుకుల శ్రీరాములు, యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ వెంకటనరసయ్య ఇంట్లో తనిఖీలు చేశారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా కదిరి మునిసిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో మావోయిస్టు సానుభూతిపరులైన పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు బెంగళూరు నుంచి అనంతపురానికి ప్రత్యేక వాహనంలో చేరుకున్న ఎన్ఐఏ బృందం స్థానిక పోలీసుల సహకారంతో బిందెల కాలనీకి చేరుకుంది. ప్రత్యేక పోలీసు బలగాలు శ్రీరాములు ఇంటిని అధీనంలోకి తీసుకోగా..ఎన్ఐఏ అధికారులు గంటల తరబడి శ్రీరాములు ఇంట్లో సోదాలు జరిపారు. మధ్యాహ్నం రెండు గంటల దాకా సోదాలు కొనసాగాయి. మావోయిస్టుల కార్యకలాపాలతో సంబంధాలు కలిగి ఉన్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. శ్రీరాములుకు చెందిన సెల్‌ఫోన్, కరపత్రాలను స్వాధీనం చేసుకున్నారు. మణిపూర్ అల్లర్ల నేపథ్యంలో ముద్రించిన కరపత్రాలు కూడా అందులో ఉన్నట్లు సమాచారం. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మీరు ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడటం ఏంటని ఆయన్ను ప్రశ్నించినట్లు తెలిసింది. అలాగే ఈ నెల 6న హైదరాబాదులోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసు అందజేశారు.

- యాడికి మండలం పుప్పాల గ్రామానికి చెందిన వెంకటనరసయ్య ఇంట్లో సోమవారం మధ్యాహ్నం ఎన్ఐఏ అధికారులు సోదాలు చేసి, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. వెంకటనరసయ్య 2005-06 మధ్యకాలంలో నక్సలైటుగా పని చేశారు. పలు కేసుల్లో జైలు జీవితం గడిపారు. భార్య 15 ఏళ్ల క్రితమే చనిపోయింది. కుమారుడు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత వెంకటనరసయ్య కొన్నాళ్లు ఒంగోలు పట్టణంలో ప్రజా కళా మండలి సభ్యుడిగా పనిచేశారు. తర్వాత స్వగ్రామానికి చేరుకున్నారు. ప్రస్తుతం పుప్పాల గ్రామంలోనే ఉపాధి పనులు చేసుకుంటూ వృద్ధాప్యంలోని తల్లికి ఆసరాగా ఉంటున్నాడు.
- కదిరి మునిసిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో దివంగత మావోయిస్ట్ నేత రవూఫ్ శిష్యుడైన రామక్కగారి చంద్ర ఇంట్లో ఎన్ఐఏ అధికారులు నిర్వహించిన సోదాల్లో ఒక పిస్టల్‌తో పాటు 14 బుల్లెట్లు, విప్లవ సాహిత్య పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అదుపులోకి తీసుకుని తమ వాహనంలో బెంగళూరు తీసుకెళ్లారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తున్న సోదాల్లో భాగంగా ఇక్కడా చేపట్టినట్లు వారు తెలిపారు. మావోయిస్టులకు సహకరిస్తున్నారన్న సమాచారంతో హైదరాబాద్, తిరుపతి, నెల్లూరు, గుంటూరు తదితర ప్రాంతాల్లోని కొందరు పౌర హక్కుల నేతలు, న్యాయవాదుల ఇళ్లు, కార్యాలయాల్లో ఈ సోదాలు చేపట్టామన్నారు.

నేటి నుంచి ఎఫ్ఏ-2 పరీక్షలు

- ప్రశ్నపత్రాలు గంట ముందు ఎంఈఓ మొబైళ్లకు
- వారి నుంచి స్కూళ్ల హెచ్‌ఎంలకు



అనంతపురం ఎడ్యుకేషన్: ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ)-2 పరీక్షల నిర్వహణకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమైంది. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోని 1-10 తరగతుల విద్యార్థులకు మంగళవారం నుంచి 6వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో మొత్తం 1-10 తరగతుల విద్యార్థులు 3,81,399 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. 1-5 తరగతులు, 9, 10 తరగతుల విద్యార్థులకు ఉదయం, 6, 7, 8 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షలు జరుగుతాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అన్ని పాఠశాలల్లోనూ పూర్తయ్యాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు ఎఫ్ఏ-2 పరీక్షల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 1-5 తరగతుల విద్యార్థులకు ఆయా యాజమాన్యాలే ప్రశ్నపత్రాలు తయారు చేసుకుంటున్నాయి. తక్కిన 6-10 తరగతులకు ప్రభుత్వమే సరఫరా చేస్తుంది.

గంట ముందు ఎంఈఓ మొబైళ్లకు ప్రశ్నపత్రాలు

డీఈఓ ఆదేశాల మేరకు డీసీఈబీ నుంచి ఉదయం, మధ్యాహ్నం గంటముందు మండల విద్యాశాఖ అధికారుల మొబైళ్లకు ప్రశ్నపత్రాలు పంపుతారు. ఎంఈఓలు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపుతారు. వారు స్కూళ్లలో టీచర్లకు పంపుతారు. పరీక్షల నిర్వహణ విధుల్లో ఉండే టీచర్లు తరగతి గదిలో బోర్డుపై ప్రశ్నపత్రాలు రాస్తారు. వాటి ఆధారంగా విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. సౌలభ్యం ఉంటే ప్రింట్ తీసుకుని విద్యార్థులకు అందజేస్తారు.

అన్ని స్కూళ్లలోనూ షెడ్యూలు ప్రకారమే పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగే పాఠశాలల్లో తర్వాత రోజు ఎఫ్ఏ-2 పరీక్షలు నిర్వహించాలంటూ చేస్తున్న ప్రచారాలను విద్యాశాఖ అధికారులు ఖండించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతున్నా...మరోవైపు విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

క్లుప్తంగా

రంగస్థల నటుడు కేసీ కృష్ణ మృతి


కేసీ కృష్ణ (ఫైల్)

అనంతపురం కల్చరల్: రంగస్థల ప్రముఖ సీనియర్ నటుడు, లలిత కళాపరిషత్ పాలక మండలి ఉపాధ్యక్షుడు కేసీ కృష్ణ (87) సోమవారం కన్నుమూశారు. పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాల్లో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మైమరపించే నటనతో మన్ననలు అందుకున్న ఆయన దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నాటకాలను ప్రదర్శించారు. జానపద గాయకుడిగా సందేశాత్మక నాటకాల్లో నటించిన కేసీ కృష్ణ తొలిరోజుల్లో స్త్రీ వేషంతో ఆకట్టుకునేవారు. వసంతకుడి పాత్ర ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలను తెచ్చిపెట్టింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొన్నేళ్ల క్రితం మృతి చెందిన తన భార్య నాగరత్నమ్మ పేరుతో కళాకారులకు అవార్డులందిస్తూ వచ్చారు. వయోభారంతో కన్నుమూసిన కేసీ కృష్ణ భౌతిక కాయానికి ఎల్‌కేపీ అధ్యక్షకార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ, పలువురు కళాకారులు ఘనంగా నివాళులర్పించారు.

పామిడిలో చోరీ

పామిడి: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి విలువైన బంగారు, నగదు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని పీఎండీ కాలనీలో నివాసముంటున్న ఇల్లూరు చంద్రశేఖర్, అరుణ దంపతులు కౌలు రైతులుగా జీవనం సాగిస్తున్నారు. తమ కుమార్తెల పెళ్లి కోసమని ఇటీవల రూ.4 లక్షల నగదుతో పాటు ఏడు తులాల బంగారు నగలు సిద్ధం చేసి, ఇంట్లోని బీరువాలో దాచి ఉంచారు. అదే కాలనీకి చెందిన సమీప బంధువు మృతి చెందడంతో రెండు రోజులుగా బంధువుల ఇంట్లోనే చంద్రశేఖర్ కుటుంబం ఉంటోంది. ఈ క్రమంలో తాళం వేసిన ఇంటిని గమనించిన దుండగులు ఆదివారం రాత్రి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు, బీరువాను ధ్వంసం చేసి, అందులో దాచిన రూ.4 లక్షలు, బంగారు నగలు అపహరించుకెళ్లారు. సోమవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహాత్ముని జీవితమే ఓ సందేశం

- ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: జాతిపిత మహాత్మాగాంధీ జీవితమే ఓ సందేశమని, ప్రతి ఒక్కరూ గాంధీజీ మార్గదర్శకాలను అనుసరించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళి అంటూ ఎంపీ తలారి రంగయ్య పేర్కొన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీతో పాటు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్య్రం తీసుకురావడంలో గాంధీజీ అవలంభించిన నిరాడంబర జీవనం, సహృదయం, సామరస్యం, ద్వేష రాహిత్యాన్ని కొనియాడారు. వీటినే ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని అనుసరించాలని పిలుపునిచ్చారు. భారతదేశానికి గ్రామ స్వరాజ్యం రావాలని, కులమతాలకతీతంగా సమానత్వం ఉండాలని అప్పట్లోనే తహతహలాడిన గాంధీజీ ఆశయాన్ని సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్ నెరవేర్చారన్నారు. అన్ని వర్గాల వారికి సమాజంలో సమాన గుర్తింపు, ఆర్థిక ఎదుగుదలకు మార్గాలు సుగమం చేశారన్నారు. గాంధీజీ కలలు కన్న పేదరికం లేని సమాజం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్థ నాయక్, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి సాహిత్య, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, నాయకులు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, పామిడి వీరాంజనేయులు, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, గౌస్‌బేగ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్‌గౌడ్, యల్లుట్ల రాజు, గాజుల ఉమాపతి, కృష్ణవేణి, శోభారాణి, అంజలి, రాధ, శోభాబాయి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు

ప్రజాతీర్పు కోరేందుకు సిద్ధం..

మరో ఐదారు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, ఈ క్రమంలో చంద్రబాబు, సీఎం వైఎస్ జగన్ పాలనల్లోని వ్యత్యాసాలను ప్రజలకు వివరించి, వారి తీర్పు కోరేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉండగా అక్రమాలకు పాల్పడిన వాళ్లు, సహకారం అందించిన వాళ్లు విదేశాలకు పారిపోయారని, వాళ్లను రప్పించడం కోసం టీడీపీ నేతలు మోత మోగించి ఉంటే బాగుండేదన్నారు. అనేక కేసుల్లో ఏళ్ల తరబడి స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు చివరకు స్కిల్ స్కాంలో మాత్రమే కాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డు, రాజధాని పేరుతో అవినీతి కుంభకోణాల్లో అడ్డంగా దొరికి ఊచలు లెక్కిస్తున్నారన్నారు. స్కిల్ స్కాంను గుర్తించింది కేంద్ర దర్యాప్తు సంస్థేనని, ఏలూరు స్కాం నుంచి ఓటుకు నోటు, ఇన్నర్ రింగ్ రోడ్డు ఇలా అనేక కేసుల్లో చంద్రబాబును అరెస్టు చేస్తే వయసుతో ముడి పెట్టడం సరికాదన్నారు. తప్పు చేసింది ఎవరైనా చట్టప్రకారం శిక్ష అనుభవించకతప్పదన్నారు.

అమ్మా.. నన్ను క్షమించు!

- రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య
- మొలల నొప్పి భరించలేక చనిపోతున్నట్లు తల్లికి లేఖ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఎస్‌ఐ నాగప్ప

గుత్తి: 'అమ్మా... నన్ను క్షమించు. నా ఆరోగ్యం బాగోలేదు. అందుకే చచ్చిపోవాలనుకున్నాను. నాకు మొలల నొప్పి ఎక్కువగా ఉంది. భరించలేకున్నా. అందుకే చనిపోవాలని అనుకున్నా. నీవు అమ్ములు దగ్గరకు పోయి ఉండు. అమ్ములూ అమ్మ జాగ్రత్త. నువ్వు పిల్లలు జాగ్రత్త. నన్ను క్షమించండి.' అంటూ తన తల్లికి లేఖ రాసి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. హృదయవిదారకమైన ఈ ఘటన గుత్తిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు... గుత్తిలోని కటికి వీధికి చెందిన కేఎం కిరణ్ కుమార్ (42) కొంత కాలంగా మొలల సమస్యతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. నొప్పి తీవ్రత భరించలేక జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన.. సోమవారం తన తల్లికి లేఖ రాసి గుత్తి జీఆర్పీ పరిధిలోని తురకపల్లి సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వీఆర్‌ఏ బలవన్మరణం


గోపి (ఫైల్)

విడపనకల్లు: కుటుంబ కలహాలతో విసుగు చెందిన ఓ గ్రామ రెవెన్యూ సహాయకుడు (వీఆర్‌ఏ) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామానికి చెందిన బోయ గోపి (39)కి భార్య తలారి సునీత, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వీఆర్‌ఏగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడు నెలల క్రితం కుటుంబ కలహాలు చోటు చేసుకోవడంతో అప్పట్లోనే భార్య తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమెను కాపురానికి పిలుచుకు వచ్చేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన గోపి... సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా ఈ విషయాన్ని గుర్తించిన బంధువుల సమాచారం మేరకు పాల్తూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యురాలు కొత్తపల్లి సురేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్, మహానంది, మర్రిస్వామి, కొత్తపల్లి శ్రీనివాసులు తదితరులు గోపి మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు.

తప్పును సరిదిద్దుకునే గుణం ఉండాలి

- కలెక్టర్ గౌతమి


జీవిత ఖైదు అనుభవిస్తున్న వారితో కలెక్టర్ గౌతమి, తదితరులు

బుక్కరాయసముద్రం: సమాజంలో తప్పు చేయని వారు ఎవరూ ఉండరనీ, అయితే చేసిన తప్పును సరి దిద్దుకున్నప్పుడే ఉత్తములుగా ఎదుగుతారని కలెక్టర్ గౌతమి అన్నారు. బీకేఎస్ మండలం రెడ్డిపల్లి జిల్లా జైలు, ఓపెన్ ఎయిర్ జైలులో సోమవారం నిర్వహించిన గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆమెతో పాటు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి దీన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. గాంధీజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశ సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప మహనీయుడు మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమన్నారు. ఖైదీల వ్యవసాయ క్షేత్రంలో ఉన్న 39 మంది జీవిత ఖైదీలు సత్ప్రవర్తతో త్వరలో విడుదలవుతున్నారని, వీరందరూ సమాజంలో గౌరవంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఖైదీలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ హనుమంతు, జిల్లా జైలు సూపరింటెండెంట్ రహమాన్, ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ చిన్నారావు, నాబార్డు స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ అనూరాధ, తహసీల్దార్ రమాదేవి, జైలర్లు మధుసూదన్‌రెడ్డి, అప్పలనాయుడు, సీఐ నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

- డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్


గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్ పిలుపునిచ్చారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రైల్వే గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ఉద్యోగులతో డీఆర్‌ఎం ప్రతిజ్ఞ చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే చక్కటి ఆరోగ్యం ప్రాప్తిస్తుందన్నారు. అనంతరం డీఆర్‌ఎం, ఇతర అధికారులు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అలాగే రైల్వే డివిజన్ ఆస్పత్రిలో గాంధీజీ, లాల్‌బహుద్దూర్ శాస్త్రి జయంతిని ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డీఆర్‌ఎం ప్రారంభించి, పలువురు రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఆస్పత్రి సీఎంఎస్ గజలక్ష్మి పాల్గొన్నారు. అంతకు ముందు ఆర్పీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని డీఆర్‌ఎం ప్రారంభించారు. స్థానిక రైల్వేస్టేషన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రైల్వే కాలనీతో పాటు ప్రధాన రహదారి మీదుగా సాగింది. డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్, ఆర్పీఎఫ్ డివిజనల్ కమిషనర్ మురళీకృష్ణ, సీఐ బెనయ్య తదితరులు సైకిల్ తొక్కుతూ ముందు వరుసలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సూర్యనారాయణ, సీనియర్ డీసీఎం మనోజ్, డీయస్పీ అబ్దుల్‌అజీజ్, ఎస్‌ఐ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం..

జాతిపిత మహాత్మ గాంధీ జీవితం అనుసరణీయమని జీఆర్పీ ఎస్పీ కె.చౌడేశ్వరి అన్నారు. సోమవారం స్థానిక జీఆర్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మహాత్ముడి ఆశయాలు అనుసరణీయం


మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: దేశ స్వాతంత్ర్యం, అభివృద్ధి కోసం పాటుపడిన మహాత్ముడి ఆశయాలు అనుసరణీయమని, మహనీయుల స్ఫూర్తితో విధులు నిర్వర్తిద్దామంటూ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మాగాంధీ, లాల్‌బహుద్దూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ఉన్న పోలీసు అమర వీరుల స్థూపం వద్ద సోమవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీజీ, లాల్‌బహుద్దూర్ శాస్త్రి చిత్రపటాలకు ఎస్పీ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి, మాట్లాడారు. ప్రేమించడం, ప్రేమను పంచడం, విశ్వాసంగా ఉండడం మహాత్మా గాంధీ ఆశయాలన్నారు. ప్రస్తుత పోలీసులు ఈ మూడు విధానాలను పాటించడం చాలా అవసరమన్నారు. స్వాతంత్ర్య సమరంలో ఆయన అనుసరించిన అహింసా వాదం, ఆలోచనలు, సిద్ధాంతాలను, లాల్‌బహుద్దూర్ శాస్త్రి ధైర్యసాహసాలను కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, సీఐలు ఇందిర, విశ్వనాథచౌదరి, ఆర్ఐ హరికృష్ణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 25 వినతులు

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 25 వినతులు అందాయి. ఎస్పీ అన్బురాజన్ స్వయంగా వినతులు స్వీకరించి, అర్జీదారులతో మాట్లాడారు. అనంతరం సమస్య తీవ్రతపై సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్పందన వినతుల పరిష్కారంపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. దిశ డీఎస్పీ ఎం.ఆంథోనప్ప, ఎస్‌బీ సీఐ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రైతాంగ విధానాలు దుర్మార్గం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు


మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

అనంతపురం కల్చరల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ విధానాలు చాలా దుర్మార్గంగా ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు (వీఎస్సార్) విమర్శించారు. వెనకబడిన ప్రాంతాల సమగ్రాభివృద్ధి అంశంపై అనంతపురంలోని లలితకళాపరిషత్తు వేదికగా సోమవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. సీపీఎం జిల్లా అధ్యక్షుడు రాంభూపాల్ అధ్యతన జరిగిన ఈ కార్యక్రమంలో వీఎస్సార్ మాట్లాడుతూ... రైతుల సంక్షేమం, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి విషయంగా గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. 2014 ఎన్నికలకు ముందు ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలను నెరవేరుస్తామని నరేంద్రమోదీ స్పష్టమైన హామీనిచ్చారని గుర్తుచేశారు. ఆయన ప్రధానిగా బాధ్యతలు చేపట్టి పదేళ్లవుతున్నా నేటికీ ఈ హామీలు నెరవేర్చలేకపోయారన్నారు. దేశాభివృద్ధిని విస్మరించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే సుస్థిర అభివృద్ధి సాధ్యమని, ఇందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) పెద్దన్న, న్యూ డెమోక్రసీ కృష్ణ, మానవ హక్కుల వేదిక నాయకుడు ఎస్ఎం బాషా, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఎం నాయకులు ఓబులు, నల్లప్ప, సావిత్రి, ఇంతియాజ్, గౌస్ దేశాయ్, రమేష్, నాగరాజు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, ఎస్‌యూసీఐసీ నాయకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

రాప్తాడులో విద్యార్థిని...

రాప్తాడు: పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం ఎం.చెర్లోపల్లికి చెందిన శీనప్ప, మంజుల దంపతుల కుమార్తె స్నేహలత (18) అనంతపురంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మార్చిలో జరిగిన పరీక్షల్లో ఆమె ఫెయిల్ అయింది. దీంతో సప్లి పరీక్షలు రాసింది. అయినా ఇందులోనూ ఆమె ఉత్తీర్ణత సాధించలేకపోయింది. తన స్నేహితులందరూ ఉత్తీర్ణులై ఉన్నత చదువులకు సిద్ధమవుతుండగా తానొక్కతే వెనుకబడడంపై తీవ్ర మనస్తాపం చెందిన ఆమె కొన్ని రోజులుగా ముభావంగా ఉంటూ వస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఆలస్యంగా గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతి సేద్యమే ఆమోదయోగ్యం

- పెట్టుబడి తగ్గించుకోవడంపై రైతులు దృష్టి సారించాలి
- రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించేలా చర్యలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి
- కలెక్టర్‌తో కలిసి రొళ్ల, మడకశిర మండలాల్లో పర్యటన
- ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటల పరిశీలన


నీలకంఠాపురంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటలను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు

మడకశిర రూరల్/రొళ్ల: పర్యావరణాన్ని కాపాడటంతో పాటు తక్కువపెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్నిచ్చే ప్రకృతి వ్యవసాయం ఇప్పుడు అందరికీ ఆమోదయోగ్యమైందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే తిప్పేస్వామి, రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయకుమార్, జిల్లా వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రమణారెడ్డి తదితరులతో కలిసి రొళ్ల, మడకశిర మండలాల్లో పర్యటించారు. తొలుత రొళ్ల మండలం ఎస్సీ కాలనీకి చెందిన రైతులు నాగరాజు, హనుమంతరాయ, కరియమ్మ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఆర్.వడ్రహట్టి గ్రామ సమీపాన ఏడు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన కంది, అలసంద, ఆముదం, గోరు చిక్కుడు, అనప పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.ఎస్.జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాగు నీరు తక్కువ లభ్యమయ్యే బంజరు భూముల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో రైతులు అధిక దిగుబడి సాధించడం అభినందనీయన్నారు. ఇందుకు కృషి చేస్తున్న రైతు సాధికార సంస్థ చర్యలు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో మరింత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన పంటల తిన్న వారికీ సంపూర్ణ ఆరోగ్యం దక్కుతుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలు అందిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో బంజరు భూముల అభివృద్ధికి ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహద పడుతోందన్నారు.

ప్రకృతి సేద్యంతో భూమి సారవంతం

అనంతరం జవహర్‌రెడ్డి మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో పర్యటించారు. రైతులు మోహన్‌దాస్, అనితాలక్ష్మి ప్రకృతి వ్యవసాయం పద్ధతులతో సాగు చేసిన వివిధ రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి రైతులతో మాట్లాడి ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులు, పెట్టుబడి, లాభాలు తదితర వాటి గురించి తెలుసుకున్నారు. ప్రకృతి సేద్యం వల్ల భూమి సారవంతం అవుతుందని, తద్వారా తక్కువ ఖర్చుతో పంటలను సాగు చేసి మంచి దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం ప్రకృతి సేద్యంలో భాగంగా రైతులు తయారు చేసే ఘన, ద్రవ జీవామృతం తయారీని జవహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు మోహన్‌దాస్ పొలంలో 26 రకాల విత్తనాల మోడల్ సాగును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన పార్వతి మహిళా సంఘం సభ్యులతో సమావేశమయ్యారు. ప్రకృతి సేద్యంలో మహిళల పాత్ర, సంఘాల పనితీరు, నిర్వహణ, బాల్యవివాహాల నిర్మూలన గురించి మాట్లాడారు. ఇంటి ఆవరణంలో, పొలంలో కూరగాయాల సాగుతో వారానికి రూ.2 వేల వరకూ ఆదాయం పొందుతున్నామని మహిళలు తెలపడంతో వారిని అభినందించారు.

వందశాతం ప్రకృతి సేద్యం చేస్తే మళ్లీవస్తా

నీలకంఠాపురం రైతులు వంద శాతం ప్రకృతి సేద్యం సాగు చేసి మంచి దిగుబడులు సాధిస్తే మళ్లీ ఇక్కడకు వస్తానని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే ఆడపిల్లలకు వివాహాలు చేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయ మూల సూత్రాలను అర్థం చేసుకుంటే వ్యవసాయంలో నష్టాలు రావన్నారు. ప్రకృతి వ్యవసాయంతో మంచి ఫలితాలు సాధించిన రైతులు దేశానికి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. మహిళలు కూడా సులభంగా వ్యవసాయం చేసి లాభాలు పొందాలన్నారు.

మడకశిర డివిజన్‌లో 32 వేల ఎకరాల్లో ప్రకృతి సాగు

మడకశిర వ్యవసాయశాఖ డివిజన్‌లోని 134 గ్రామాల్లో 16,600 మంది రైతులు 32 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మానాయక్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి తెలిపారు. వీరంతా ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేసి ఆదాయం పొందుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల దిగుబడులు పెరగడంతో పాటు ఆదాయం ఎక్కువగా ఉండటంతో మిగతా రైతులూ ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారిస్తున్నారని, దీంతో మడకశిర డివిజన్‌లో ప్రకృతి సాగు విస్తీర్ణం ఏటికేడు పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ కార్తీక్, తహసీల్దార్ ముర్తావలి, వైఎస్సార్ క్రాంతి పథం పీడీ నరసయ్య, సింగల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, ఎంపీపీ కవిత, రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు ఆనంతరాజు, ఏడీఏ కృష్ణమీనన్, డీపీఓ విజయకుమార్, డీఎల్‌పీఓ శివారెడ్డి, రొళ్ల తహసీల్దార్ హసీనాసుల్తానా, వివిధ శాఖల అధికారులు, కోఆర్డినేటర్ రమేష్, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం



నేను 2019 నుంచి నా భార్య సహకారంతో రెండు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నా. ఏడాదికి రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం పొందుతున్నా. ప్రకృతి సేద్యం వల్ల పెట్టుబడి తక్కువగా ఉండటంతో పాటు మంచి దిగుబడులు వస్తున్నాయి. అందువల్లే ఏటా ఆదాయం పొందుతున్నా. నన్ను చూసి మిగతా రైతులూ ప్రకృతి సేద్యం చేస్తున్నారు. – మోహన్‌దాస్, రైతు, నీలకంఠాపురం, మడకశిర మండలం

క్లుప్తంగా

అనంతవాసులకు సేవా పురస్కారాలు




పురస్కారం అందుకుంటున్న దాసరి ఆది నారాయణ, దాసన్నగారి కృష్ణమూర్తి

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన రచయిత మహాబోధి కృష్ణమూర్తి విశిష్ట సాహితీ రత్న, ప్రముఖ గాయకుడు దాసరి ఆదినారాయణ ప్రజా కళారత్న పురస్కారాలు అందుకున్నారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గుర్రం జాషువా, మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కళాపరిషత్ అంతర్జాతీయ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ పెద్దిటి యోహాను ఆధ్వర్యంలో పలువురు రచయితలు, సాహితీవేత్తలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించి, సత్కరించారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ఆత్మకూరు: మండలంలోని తోపుదుర్తిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివప్రసాద్, ఎంపీపీ హేమలత సోమవారం తెలిపారు. తోపుదుర్తి గ్రామంలో సచివాలయంలో గ్రామ వలంటీర్లకు, సచివాలయ ఉద్యోగులకు సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్నవారిని గుర్తించి, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి తీసుకురావాలన్నారు. అన్ని రోగాలకు సంబంధించి వైద్య నిపుణులు వస్తారన్నారు. సర్పంచ్ ఓబులేష్, ఎంపీటీసీ పోతులయ్య పాల్గొన్నారు.

'లియాఫీ' ఆవిర్భావ దినోత్సవం



లియాఫీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక ఎల్ఐసీ కార్యాలయాల్లో భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) 59వ ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఏజెంట్ల సంక్షేమంతో పాటు పాలసీదారుల శ్రేయస్సుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంస్థకు పునాదిలాంటి పాలసీదారులకు ముున్ముందు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కేంద్రం, సంస్థ యాజమాన్యంతో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. అనంతరం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సమావేశంలో బ్రాంచి-1 మేనేజర్ మధుబాబు, లియాఫీ నాయకులు వేణుగోపాల్, డివిజన్ గౌరవాధ్యక్షులు తిరుపతయ్య, ఫణికుమార్, నందీశ్వర్లు, బాలం భాస్కర్, మల్లికార్జునరెడ్డి, వెంకటనాయుడు, శేషాద్రి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు: నూతన ఎంపీడీఓగా రఘునాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీఓకు ఎంపీపీ హేమలత పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఆత్మకూరులో పని చేస్తున్న విజయ్ ప్రసాద్ సెలవుపై వెళ్లడంతో డీ.హీరేహాళ్ ఎంపీడీఓగా ఉన్న రఘునాథ్ ఇక్కడికి డెప్యుటేషన్‌పై వచ్చారు.

పంచాయతీల అభివృద్ధికి చర్యలు



మాట్లాడుతున్న ఈఓఆర్డీ నరసింహారెడ్డి

రాప్తాడు: గ్రామాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఈఓఆర్డీ నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాప్తాడు, ప్రసన్నాయపల్లి గ్రామాలతో పాటు మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల వద్ద ఉపాధి గ్రామసభలు నిర్వహించారు. రాప్తాడు, ప్రసన్నాయపల్లి గ్రామాల్లో జరిగిన గ్రామ సభలకు ఈఓఆర్డీ హాజరై మాట్లాడారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోవు గ్రామా పంచాయతీ ప్రణాళికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు సాకే తిరుపాలు, శశికళ, ఏపీఓ సావిత్రి, ఏపీఎం శివకుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసులు, మల్లికార్జున, వీఆర్వోలు పాల్గొన్నారు.

మహనీయులే నేటి తరానికి మార్గదర్శకులు

అనంతపురం సిటీ: మహనీయులే నేటి తరానికి మార్గదర్శకులని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకొని జెడ్పీలో డిప్యూటీ సీఈఓ లలితా బాయి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు

అనంతపురం: జేఎన్‌టీయూఏ పాలక భవనంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు సోమవారం నిర్వహించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, డాక్టర్ డి.విష్ణువర్ధన్, ప్రొఫెసర్ సురేష్ బాబు, ప్రొఫెసర్ చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

= ఎస్కేయూలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత, ప్రొఫెసర్లు వెంకటనాయుడు, శోభాలత, రాంగోపాల్, డాక్టర్ సత్యనారా యణ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శ్రీరాములునాయక్, డిప్యూటీ రిజిస్ట్రార్ లక్ష్మీరాంనాయక్ పాల్గొన్నారు.

= జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ, సంస్థ కార్యదర్శి రమ తదితరులు పాల్గొన్నారు.

= జేఎన్‌టీయూ-ఓటీపీఆర్ఐలో ప్రొఫెసర్ బి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చక్కా గోపీనాథ్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి కె. ఓబుళపతి ఆధ్వర్యంలో గాంధీ, దివంగత ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు సురేష్ కుమార్, అల్తాఫ్ హుస్సేన్, ఆదినారాయణ స్వామి, భాస్కర్ రెడ్డి వీరాంజనేయులు, త్యాగరాజు, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

జిల్లా శాఖ ఆధ్వర్యంలో..: వైఎస్సార్ టీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్.నాగిరెడ్డి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుధ్య కార్మికులను సన్మానించిన ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: నగరాన్ని పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ప్రజారోగ్యం కోసం కార్మికులు చేస్తున్న సేవలను కొనియాడారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు.

15 మంది కుటుంబాలకు ప్రొసీడింగ్స్: నగర పరిశుభ్రతకు పాటుపడుతున్న 27 మంది పారిశుధ్య కార్మికులను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణా రెడ్డి సన్మానించారు. అదేవిధంగా వివిధ కారణాలతో మృతి చెందిన 15 మంది మృతుల కుటుంబ సభ్యులకు ప్రమాదాల్లో మరణిస్తే రూ.5లక్షలు, సాధారణ మరణానికి రూ.2 లక్షలు ఇచ్చేందుకు ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఎంహెచ్ఓ గంగాధర్ రెడ్డి, కార్పొరేటర్లు సైపుల్లాబేగ్, అబూసలేహా, ఇషాక్, సుజాత, దుర్గాదేవి పాల్గొన్నారు.

రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు జి.వెంకటరామకృష్ణ, పి.రవీంద్రరెడ్డి, కె.గోవిందరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, గోపాల్, జిల్లా నాయకులు బి.చెన్నారెడ్డి, హెచ్.రామకృష్ణ, కృష్ణ, వెంకటరెడ్డి, రామచంద్రయ్య పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : విద్యార్థులు గాంధీజీ అనుసరించిన మార్గంలో నడవాలని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి అన్నారు. సోమవారం నగరంలోని బీసీ బాలికల వసతి గృహంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సుభాషిణి, సంక్షేమ అధికారి మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో నడవాలి

అనంతపురం అర్బన్: జాతిపిత మహాత్మాగాంధీ బాటలో అందరూ నడవాలని డీఆర్ఓ గాయత్రిదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్ఓ ముఖ్యఅతిథిగా హాజరై మహాత్మా గాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఆనంద్, పరిపాలనాధికారి శ్రీధర్, సూపరింటెండెంట్ ఈశ్వరయ్యశెట్టి, సిబ్బంది ఆంజనేయులు, జ్యోతిర్మయి, రామప్ప, ఈశ్వర్, నాగరాజు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప, జిల్లా కోశాధికారి రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, సహఅధ్యక్షులు ఖలందర్ బాషా, ఉపాధ్యక్షులు తిప్పన్న, రమేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

= బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకురాలు దేవిరెడ్డి లక్ష్మిదేవి, కొనకొండ్ల రాజేష్, డాక్టర్ శ్రీధర్, కిరణ్ గౌడ్, రత్న మయ్య, రామచంద్రయ్య, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు అశోక్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అశోక్ పాల్గొన్నారు.

అనంతపురం మెడికల్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి గిరిజ మనోహర్ రావు, హెచ్ఈఓ సత్యనారాయణ, డిప్యూటీ డెమో త్యాగరాజు, ఈఓ లక్ష్మన్న, సీనియర్ అసిస్టెంట్ సురేష్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్: మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమాన్ని సోమవారం సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో నిర్వహించారు. సమాచార శాఖ అధికారి గురుస్వామిశెట్టి పాల్గొని, గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆత్మకూరు: మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆత్మకూరు మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. వైస్ ఎంపీపీ నీలిమ, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక ఎస్వీఐటీ కళాశాలలో కరస్పాండెంట్ వీబీ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ సూర్యశేఖర్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: ఏనారాయణపురం పంచాయతీ కార్యాలయంలో కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం ఎంపీటీసీలు నాగేంద్ర, శృతి, హాజీవలి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యనిర్వాహక సభ్యుడు మల్లెల వేణుగోపాల్ , పంచాయతీ కార్యదర్శి అశోక్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి జగన్ మోహన్‌రెడ్డి, సత్తెన్న పాల్గొన్నారు.

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. అనంతరం పంచాయతీ కార్మికులను సన్మానించి, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, కక్కలపల్లి సర్పంచ్ గార్లదిన్నె కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యులు జూటూరు పెన్నోబులేసు, ఉపసర్పంచ్ బండి రమేష్, పంచాయతీ కార్యదర్శి నరసింహా రెడ్డి, వార్డు సభ్యు లు, సచివాలయ సిబ్బంది, వలంటర్లు పాల్గొన్నారు.

రాప్తాడు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, ఎంఈఓ మల్లికార్జున, ఇంజినీర్ ఓబుల్‌దాస్, ఏపీఓ ఓబన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సమాచార శాఖ అధికారి గురుస్వామిశెట్టి, సిబ్బంది



జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం ఉమ తదితరులు



డీఎంహెచ్ఓ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి



కక్కలపల్లిలో కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం



ఎ.నారాయణపురంలో దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం



అనంతపురం సిటీ: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



కలెక్టరేట్‌లో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకల్లో పాల్గొన్న డీఆర్ఓ గాయత్రిదేవి



రాప్తాడులో గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజాప్రతినిధులు



ఆత్మకూరులో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి



పెన్షనర్ల భవనంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఓబుళపతి, నాయకులు



గాంధీజీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి, నాయకులు

కురుగుంట వైఎస్సార్ కాలనీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, పార్టీ మండల కన్వీనర్, స్థానిక నాయకులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్సార్‌కాలనీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ సోమవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోలేదని, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో రూ.80 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కవిత, ఉపసర్పంచ్ మాధవరెడ్డి, నాయకులు లక్ష్మిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిరణ్ కుమార్ రెడ్డి, ఆదినారాయణ, కోఆప్షన్ సభ్యుడు ముస్తఫా, డీలర్ రవి, రఫీ, ఈశ్వరయ్య ఓబుళపతి, మన్సూర్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సామాజిక న్యాయం

- డీఎస్ఎంఎం జాతీయ నాయకుడు శ్రీనివాసరావు



కేవీపీఎస్ జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న డీఎస్ఎంఎం జాతీయ నేత శ్రీనివాసరావు

అనంతపురం అర్బన్: ఐక్య ఉద్యమాలతొనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని డీఎస్ఎంఎం (దళిత్ షోషణ్ ముక్తి మంచ్)జాతీయ నాయకుడు వి.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం 25వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై సంఘం జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికీ వివక్షత, అంటరానితనం కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, నగర అధ్యక్షుడు అక్కులప్ప, నాయకులు ఎర్రిస్వామి, దేవరాజ్, శివ, గోపి, డప్పు కళాకారుల సంఘం జిల్లా నాయకులు నరసింహులు, నారాయణ, ఎ.నరసింహులు, రామాంజినేయులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే బీమా పథకం అమలు చేయాలి

అనంతపురం అర్బన్: పంటల బీమాలో ఇన్సూరెన్స్ కంపెనీల ప్రమేయం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. సోమవారం స్థానిక సప్తగిరి సర్కిల్ వద్ద జీవో ప్రతులను దహనం చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడారు. నాయకులు శివారెడ్డి, రాజారామిరెడ్డి, శ్రీనివాసులు, రామిరెడ్డి, రామాంజనేయులు, వెంకటచౌదరి, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ఏపీడబ్ల్యూజే నాయకులు కోరారు. సోమవారం గాంధీ జయంతి, సేవ్ జర్నలిజం డే సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్ నుంచి టవర్‌క్లాక్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకూ ర్యాలీ చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. జర్నలిస్టులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని దేశ వ్యాప్తంగా సేవ్ జర్నలిస్ట్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే నాయకులు ప్రవీణ్, ఐజేయూ సభ్యుడు ప్రభాకర్ నాయుడు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రసూల్, జిల్లా కమిటీ సభ్యులు లోకరాజు, చౌడప్ప, చలపతి, కేపీ కుమార్ పాల్గొన్నారు.

జాహ్నవికి స్వర్ణాలు



అనంతపురం: అనంతపురం రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ 35వ జిల్లా స్థాయి పోటీలు గత నెల 30 నుంచి ఈనెల 1వతేదీ వరకు జరిగాయి. రామ్‌నగర్‌లోని మాక్ రోరల్ స్కేటింగ్ గ్రౌండ్‌లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న 100 మందిలో 25 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 14 -17 ఏళ్ల మధ్య వయస్సున్న వారు పాల్గొన్నారు. అనంతపురం నగరానికి చెందిన జాహ్నవి ఏకంగా మూడు బంగారు పతకాలు సాధించింది. కోచ్‌లు నాగేంద్ర, అంజి అనిల్, హేమంత్, హేమాద్రి అభినందనలు తెలిపారు.

టిఫిన్ సెంటర్లుగా మారిన బస్‌షెల్టర్లు

గార్లదిన్నె: 44వ జాతీయ రహదారిపై ప్రయాణికులు, వాహనదారులకు కోసం ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్లు టిఫిన్ సెంటర్లకు అడ్డాగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు తప్పడం లేదు. వివరాల్లో కెళితే.. మండల కేంద్రం గార్లదిన్నె విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పామిడి వరకు జాతీయ రహదారిపై బస్‌షెల్టర్లు ఉన్న ప్రాంతాల్లో కొంత మంది టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఉదయం టిఫిన్ సెంటర్ల వద్ద అధిక సంఖ్యలో రోడ్డుపై వాహనాలు నిలపడంతో ప్రయాణికులు, వాహన దారులకు అవస్థలు తప్పడం లేదు. టిఫిన్ సెంటర్లున్న చోట ఏదైనా ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

'ఆరోగ్య సురక్ష' శిబిరాలకు సిద్ధం కండి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష ఆరోగ్య క్యాంపుల్లో ఎలాంటి లోటుపాట్లు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ భాగ్యలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరంలోని ఇందిరానగర్ ఎన్‌టీఆర్ పాఠశాలను కమిషనర్ పరిశీలించారు. క్యాంపులకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేదిలేదన్నారు.

ఆర్థో విభాగానికి పరికరాల వితరణ

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఆర్థో విభాగానికి గుంతకల్లు లైఫ్ లైన్ ఆస్పత్రి ఆర్థో వైద్యుడు డాక్టర్ జిలాని రూ.30 వేల పరికరాలను అందజేశారు. సోమవారం జీజీహెచ్‌లో ఆర్థో హెచ్‌ఓడీ డాక్టర్ ఆత్మరాంకు డాక్టర్ జిలానీ పరికరాలు అందజేశారు.

ప్రశాంతంగా జీవించండి

ఆత్మకూరు: గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలని ఎస్ఐ జనార్దన్ సూచించారు. సోమవారం మండలంలోని మదిగుబ్బ, బి.యాలేరు గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి గొడవలు, సంఘటనలు జరిగినా పోలీసులకు గానీ 100 నంబర్‌కు గానీ సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం వడ్డుపల్లి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు.

పనిదినాలు పూర్తి చేసుకోండి

ఆత్మకూరు: ఉపాధి పనుల్లో భాగంగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకోవాలని ఏపీడీ నీలిమ సూచించారు. సోమవారం పంచాయితీ కార్యాలయాల్లో గ్రామ సభ నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ వచ్చే మార్చి నెలలోపు వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకుంటే ఏప్రిల్ నుంచి కొత్త పనులు ప్రారంభమవుతాయన్నారు. ఐదెకరాల పొలం ఉన్న రైతులను గుర్తించి ఉద్యాన తోటల పెంపకానికి ప్రోత్రహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, వైస్ ఎంపీపీ నీలిమ, పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు గాండ్లపర్తిలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివకృష్ణ ఓ ప్రకటనలలో తెలిపారు.

నవంబర్ 2న షష్టిపూర్తి సత్కారం

అనంతపురం కల్చరల్: సాయిట్రస్టు ఆధ్వర్యంలో వృద్ధులకు షష్టిపూర్తి సత్కారం చేయనున్నట్లు నిర్వాహకుడు విజయ్‌కుమార్ తెలిపారు. గుత్తిరోడ్డులోని బల్లా కన్వెన్షన్ హాలులో ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వందల మంది వృద్ధులకు ఉచితంగా షష్టిపూర్తి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్: 8712345520, 9666756921 వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.